నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 శుక్రవారం 29 డిసెంబర్ 2023
MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## వేతనాలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా


కార్మికులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

కాగజ్‌నగర్, డిసెంబర్ 28 : వేతనాలు చెల్లించాలని కోరుతూ కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కార్మికులు ఆందోళన చేపట్టారు. గురువారం వేకువ జామున కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రతి నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్నా ఈఎస్‌ఐ, పీఎఫ్ ఖాతాలో పెండింగ్ డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య అక్కడికి చేరుకొని బకాయి ఉన్న వేతనాలు చెల్లిస్తామని, ఫిబ్రవరిలో ఈఎస్‌ఐ, పీఎఫ్ సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు శంకర్, సంజీవ్, తదితరులు ఉన్నారు.

## వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం

జన్నారం, డిసెంబర్ 28 : మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం వీరబ్రహ్మేంద్ర స్వామి-గోవిందమాంబల కల్యాణాన్ని వేదపండితులు వైభవంగా నిర్వహించారు. అంతకుముందు భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో రావుల రాంచంద్రం, గంగాధర్, శ్రీను, విజేందర్, పొనకల్‌కు చెందిన స్వర్ణకారులు, విశ్వబ్రాహ్మణులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి-గోవిందమాంబల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


భీమయ్యక్ దేవుని వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు

## ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, డిసెంబర్ 28 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని సిర్సిగాంలోని భీమయ్యక్ దేవుని వార్షికోత్సవ మహోత్సవంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణ, ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్‌తో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం క్రీడలు ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్‌హైమద్, సర్పంచ్ తిరుపతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


వన్యప్రాణులను హతమార్చిన నిందితులతో అటవీ శాఖ అధికారులు

## వన్యప్రాణులను వేటాడిన 15 మంది అరెస్ట్

- పరారీలో మరో 16 మంది

సిర్పూర్(టీ), డిసెంబర్ 28 : సిర్పూర్(టీ) అటవీశాఖ రేంజ్ పరిధిలోని చింతకుంట గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు అమర్చి రెండు చుక్కల దుప్పులను హతమార్చిన 15 మందిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో వేణుబాబు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల 23న చింతకుంట అటవీ ప్రాంతంలో అదే గ్రామానికి చెందిన కొందరు విద్యుత్ తీగలు అమర్చి రెండు చుక్కల దుప్పులను హతమార్చారు. సమాచారం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విచారణ చేపట్టి మొత్తం 31 మందిపై కేసు నమోదు చేశారు. ఈ నెల 28న 15 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో 16 మంది పరారీలో ఉన్నారు. అటవీ జంతువులను వేటాడినా, పంట పొలాల చుట్టూ విద్యుత్ కంచెలు అమర్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్(టీ) అటవీ శాఖ రేంజ్ అధికారి పూర్ణచందర్ రావు, డీఆర్వో ముసావీర్, ఎఫ్ఎస్‌వోలు సద్దాం, పోశెట్టి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ అధికారుల సంఘం అధ్యక్షుడిగా సుభాష్


నూతనంగా ఎన్నికైన జూనియర్ అటవీ అధికారుల సంఘం సభ్యులు

కాసిపేట, డిసెంబర్ 28 : తెలంగాణ రాష్ట్ర జూనియర్ అటవీ అధికారుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ఏ సుభాష్ ఎన్నికయ్యారు. గురువారం మందమర్రిలోని ఇల్లందు క్లబ్‌లో రాష్ట్ర ఎన్నికల అధికారి ప్రశాంత్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. జనరల్ సెక్రెటరీగా అబ్దుల్ అజార్, వైస్ ప్రెసిడెంట్‌గా లాల్‌బాయి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బీ. ప్రవీణ్ నాయక్, జాయింట్ సెక్రెటరీగా ఎం.జ్యోతి, కోశాధికారిగా పీ. సతీశ్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి అటవీశాఖ అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. తమను ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఫారెస్ట్ అధికారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ప్రకటించారు. ఎన్నికల పరిశీలకుడు ముసావీర్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరేశ్, కృష్ణ, ప్రవీణ్ మహాజన్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన పరేషాన్

### ఐదు గ్యారంటీలకు ఒకటే దరఖాస్తు ఫారం

- రేషన్ కార్డు లేనోళ్ల విషయంలో కొరవడిన స్పష్టత
- అధికారుల్లో అస్పష్టతతో విసుగుపోయిన ప్రజలు
- పింఛన్ కోసం మరోసారి అప్లికేషన్ ఇవ్వాలేమోనని వచ్చి ఇబ్బందులు పడ్డ వృద్ధులు
- ఫారాలు లేక వెనుదిరిగిన దరఖాస్తుదారులు

మంచిర్యాల, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో భాగంగా చేపట్టిన 'ప్రజాపాలన' ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రారంభమైంది. ఐదు గ్యారంటీలకు ఒకటే దరఖాస్తు తీసుకున్నారు. కాకపోతే రేషన్ కార్డు లేనోళ్లు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చా.. రేషన్ కార్డు ఉన్నోళ్లే చేసుకోవాలా.. అనే విషయంపై అధికారులు ఒక్కొక్కరూ ఒక్కో తీరు సమాధానమివ్వడంపై ప్రజలు పరేషాన్ అవుతున్నారు. రేషన్ కార్డు ఉంటేనే గ్యారంటీలకు అర్హులని, రేషన్‌కార్డు లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని భిన్న ప్రకటనలు రావడంతో క్లారిటీ లేకుండా పోయింది. రేషన్ కార్డు లేదు దరఖాస్తు చేసుకోవచ్చా.. అన్న ప్రశ్నకు అధికారుల నుంచి రకరకాల సమాధానాలు వచ్చాయి. 'రేషన్ కార్డు లేదని మేము రాసుకుంటామని.. మీరు దరఖాస్తు చేసుకోండని కొందరు అధికారులు చెబుతుండగా.. మీరిచ్చే దరఖాస్తులో రేషన్ కార్డు లేదని రాసి ఇవ్వండని మరికొందరు.. రేషన్ కార్డు లేదని లేఖ రాసి దరఖాస్తుకు జత చేయండని ఇంకొందరు..' ఇలా ఎవరికి తోచినట్లు వారు చెబుతుండడంతో దరఖాస్తు చేసేందుకు వచ్చిన వాళ్లంతా విసుగుపోవాల్సి వస్తున్నది. ఇప్పటికే వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధి పొందుతున్న వారు మళ్లీ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలా.. అవసరం లేదా.. అనే విషయంలోనూ క్లారిటీ లేకుండా పోయింది. ఆసరా పింఛన్ల విషయంలో మాత్రమే అప్లికేషన్‌లో (ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వారు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు) అని స్పష్టంగా పేర్కొన్నారు. కొన్ని చోట్ల పింఛన్లు వస్తున్నప్పటికీ మరోసారి దరఖాస్తు చేసుకోవాలేమోనని వచ్చిన వృద్ధులను అధికారులు తిరిగి పంపించేయడం కనిపించింది. దీంతో వృద్ధులు కాస్త ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

**మండలానికి రెండు బృందాలు..**

ప్రతి మండలానికి రెండు బృందాల చొప్పున ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించేందుకు వచ్చాయి. ఒక్కో బృందం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మరో గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించాయి. మున్సిపాలిటీల్లో వార్డుకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేశారు. ప్రతి వార్డుకు ఒక వార్డు ఆఫీసర్, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఆరు వార్డులకు కలిపి ఒక సూపర్‌వైజర్, నాలుగు వార్డులకు ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో తొలిరోజు నాలుగు గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించడం పూర్తయ్యింది. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, రేషన్ కార్డు జిరాక్స్, ఒక పాస్ ఫోర్ట్ సైజ్ ఫొటో వెంట తెచ్చుకోవాలని అధికారులు చెబుతున్నారు. కొన్ని మండలాల్లో రెండు గ్రామాలు ఒక పంచాయతీగా ఉన్న దగ్గర కాస్త ఇబ్బంది ఏర్పడింది. పంచాయతీ మొత్తానికి ఒకే బృందం రావడంతో దాదాపు రెండు, మూడు కిలోమీటర్లు పోయి దరఖాస్తులు ఇవ్వాల్సి వచ్చింది. తొలిరోజు ప్రజాపాలన నిర్వహించిన గ్రామాలన్నీ తక్కువ జనాభా ఉన్నవి కావడంతో ఇబ్బందులు ఏర్పడలేదు. జన సందడి కూడా తక్కువగా కనిపించింది. రానున్న రోజుల్లో దరఖాస్తు చేసుకునేందుకు చాలా మంది వచ్చే అవకాశాలు ఉన్నాయి. అప్పటి వరకైనా దరఖాస్తు విషయంలో అధికారులు ఓ క్లారిటీ ఇవ్వాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, చెన్నూర్ పట్టణంతో పాటు కాగజ్‌నగర్‌లో దరఖాస్తు ఫారాలు అయిపోవడంతో పలువురు దరఖాస్తుదారులు వెనుదిరిగి వెళ్లారు.



**మా ఊర్లో కౌంటర్ పెడితే ఈ గోస తప్పేది**

*చెన్నూర్ రూరల్, డిసెంబర్ 28 : నా పేరు పోసక్క. మాది అక్కెపల్లి గ్రామం కింద ఉండే శివలింగాపూర్. ఇండ్లు, పింఛన్లు కావాల్సినోళ్లు దరఖాస్తులు చేసుకొమ్మని చెప్పిన్రు. గందుకే అక్కెపల్లికి నడుసుకుంట (కిలోమీటర్) వచ్చిన. నాకు పింఛన్ వస్తలేదు. ఫారం నింపించి సార్లకు ఇచ్చిన. మా ఊరిలో కౌంటర్ పెడితే నాకు ఈ గోస తప్పేది.*

**మంచిర్యాల జిల్లాలో దరఖాస్తులు..**

నస్పూర్, డిసెంబర్ 28 : మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో గురువారం నిర్వహించిన 'ప్రజాపాలన'కు దరఖాస్తులు వెల్లువెత్తాయి. మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాల కోసం మొదటి రోజు 8,425 దరఖాస్తులు, అలాగే 7 మున్సిపాలిటీల్లో 14,890 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## ఆలస్యంగా ప్రారంభం

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో పలుచోట్ల ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. పల్లెల్లో ప్రజలు ఉదయం నుంచే బారులు తీరగా.. పట్టణ ప్రాంతాల్లోని కేంద్రాల వద్ద పెద్దగా సందడి కనిపించలేదు. కొన్ని కేంద్రాల వద్ద మధ్యాహ్నం ఒంటి గంట అయినా జనాలు రాలేదు. ఆసిఫాబాద్ మండలం మాలన్‌గొందిలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కాగజ్‌నగర్‌లో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్ పాల్గొన్నారు. కాగజ్‌నగర్‌లోని పలు వార్డుల్లో ఉదయం 10 గంటలైనా ప్రజలు కనిపించలేదు. 26వ వార్డులో మధ్యాహ్నం ఒంటిగంట అయినా అర్జీల స్వీకరణ ప్రారంభం కాలేదు. పెంచికల్‌పేట్ మండలం కొండపల్లిలో 10 గంటల తర్వాత దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాల వద్ద అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించారు. అర్జీదారుల దరఖాస్తులను నింపేందుకు ప్రత్యేకంగా కొందరిని నియమించారు. జిల్లాలో మొదటి రోజు 6,186 దరఖాస్తులు వచ్చాయి.


మాలన్‌గొందిలో అర్జీలు స్వీకరిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు


మధ్యాహ్నం ఒంటి గంట వరకు కూడా ఖాళీగా ఉన్న కాగజ్‌నగర్ 26వ వార్డులోని కేంద్రం


కాగజ్‌నగర్ : 8 గంటలకు ప్రారంభం కావాల్సిన ప్రజా పాలన కార్యక్రమం 10 గంటల వరకు ప్రారంభం కాని దృశ్యం


పెంచికల్‌పేట్ : సంజీవనగర్‌లో ప్రజా పాలన దరఖాస్తుల కేంద్రానికి హాజరు కాని అధికారి

## కిష్టయ్య చెరువును కాపాడండి

- తహసీల్దార్, ఎస్ఐకి వినతి

భీమారం, డిసెంబర్ 28 : మంచిర్యాల జిల్లా భీమారం మండలం బూర్గుపల్లి గ్రామ శివారులోని కిష్టయ్య చెరువును కబ్జా దారుల నుంచి కాపాడాలని స్థానిక తహసీల్దార్ విశ్వంబర్‌తో పాటు ఎస్ఐ రాజావర్ధన్‌కు ఆయకట్టు రైతులు గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొందరు చెరువుకు గండి కొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ఆ చెరువు కింద 100 మంది రైతులు 50 ఎకరాల్లో సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. మిషన్ కాకతీయ కింద చెరువుకు మరమ్మతు చేయడంతో యేటా రెండు పంటలు పండించుకుంటున్నట్లు వారు తెలిపారు. ఆ చెరువుకు హద్దులు నిర్ణయించాలని, కబ్జాకు యత్నిస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వారు తెలిపారు. తహశీల్దార్ విశ్వంబర్ మాట్లాడుతూ కబ్జాదారులు ఎంతటివారైనా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని, సర్వే చేసి చెరువు హద్దులు నిర్ణయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు నీలాల లక్ష్మి, సపోట పెద్దరాములు, సపోట చిన్న రాములు, ధరావత్ రాములు, భూక్యరాములు, భూక్య వినోద్, సపోట రాజబాపు, సపోట తోల్చ ఉన్నారు.


తహసీల్దార్ విశ్వంబర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆయకట్టు రైతులు

# గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ

- 11 ఏరియాల్లో ఐదుచోట్ల జయకేతనం
- ఓట్లపరంగా ఐఎన్‌టీయూసీని అధిగమించి హోదా


ఏఐటీయూసీ నాయకులకు గుర్తింపు పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారులు


శ్రీరాంపూర్‌లో విజయోత్సవ సంబురాల్లో కార్యకర్తలు

మంచిర్యాల, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీపీఐ అనుబంధ సంఘమైన ఆలిండియా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (ఏఐటీయూసీ) జయకేతనం ఎగురవేసింది. 11 డివిజన్లలో 5 చోట్లే గెలువగా, అత్యధిక ఓట్లు రావడంతో గుర్తింపు హోదా దక్కించుకున్నది. ఇక కాంగ్రెస్ అనుబంధ సంఘమైన ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్టీయూసీ) ఆరుచోట్ల గెలిచినా.. తక్కువ ఓట్లు రావడంతో గుర్తింపు సంఘంగా ఎన్నిక కాలేకపోయింది.

**11 ఏరియాల్లో..**

సింగరేణి 11 ఏరియాల్లోనే అతి పెద్దదైన శ్రీరాంపూర్‌లో ఏఐటీయూసీకి 4,856 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి ఐఎన్టీయూసీకి ఇక్కడ 2,690 ఓట్లు వచ్చాయి. దీంతో 2,166 భారీ మెజార్టీతో ఏఐటీయూసీ గెలిచింది. బెల్లంపల్లిలో 122 ఓట్లు, మందమర్రిలో 469 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. వీటితో పాటు ఆర్జీ-1, ఆర్జీ-2 ఏరియాల్లో ఏఐటీయూసీ గెలిచింది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన గుర్తింపు సంఘమైన ఐఎన్టీయూసీ కొత్తగూడెం కార్పొరేట్, కొత్తగూడెం డివిజన్, మణుగూర్, ఇల్లందు, ఆర్జీ-3, భూపాలపల్లి ఏరియాల్లో గెలిచింది. మొత్తం 11 ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ 6 ఏరియాల్లో, ఏఐటీయూసీ 5 ఏరియాల్లో గెలుపొందాయి. కానీ ఓట్ల పరంగా చూసుకుంటే ఏఐటీయూసీకి రెండువేల పైచిలుకు ఓట్లు ఎక్కువగా రాగా, గుర్తింపు సంఘం హోదాను దక్కించుకున్నది. కాగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో వచ్చి నెల రోజులు కూడా కాకముందే కోల్డ్‌బెల్ట్ ఏరియాలో కీలకమైన మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల సింగరేణి కార్మికులు వారి గుర్తింపు సంఘాన్ని తిరస్కరించడం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలిచినా, ఈ మూడు ఏరియాల్లో ఐఎన్‌టీయూసీని కార్మికులు చిత్తు చేశారు. కార్మిక సంఘంలో సుదీర్ఘకాలంగా ఉన్న వారిని కాదని కొత్త వారికి ప్రాధాన్యం ఇవ్వడం, ఇటీవల కాలంలో జరిగిన చేరికలతో గుర్రు మీద ఉన్న కార్మికులు ఎన్నికల్లో కోపాన్ని చాటిచెప్పారు. దీంతో మూడు ఏరియాల్లో ఐఎన్‌టీయూసీకి పరాభవం తప్పలేదు. కాగా ఖమ్మం, వరంగల్ ఏరియాల్లో మంత్రులను ఇన్‌చార్జులుగా పెట్టినా.. ఐఎన్‌టీయూసీ కరీంనగర్, మంచిర్యాల జిల్లాలకు ఎమ్మెల్యేతో సరిపెట్టింది. ఇది కూడా ఈ ఏరియాల్లో ఆ సంఘం ఓటమికి దారితీశాయి.

**ఏఐటీయూసీ సంబురాలు**

సీసీసీ నస్పూర్, డిసెంబర్ 28 : సీసీసీ సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కౌంటింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలకు తరలివచ్చారు. ఆయా యూనియన్ల కార్యకర్తల నినాదాలతో హోరెత్తించారు. రాత్రి 11గంటల వరకు రిజల్ట్స్ కోసం వేచిచూశారు. ఏఐటీయూసీ విజయం సాధించడంతో నాయకులు సంబురాల్లో మునిగితేలారు. పటాకులు కాల్చి.. మిఠాయిలు పంచి.. నృత్యాలు చేశారు. ఫలితాల తర్వాత ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బాజీసైదా, కొట్టె కిషన్‌రావు కౌంటింగ్ కేంద్రానికి వచ్చి పాల్గొన్నారు.

**మూడు ఏరియాల్లో ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీకి వచ్చిన ఓట్లు, మెజార్టీ..**

| ఏరియా | ఐఎన్‌టీయూసీ | ఏఐటీయూసీ | మెజార్టీ |
|---|---|---|---|
| శ్రీరాంపూర్ | 2,690 | 4,856 | 2,166 |
| బెల్లంపల్లి | 375 | 497 | 122 |
| మందమర్రి | 1,648 | 2,117 | 469 |

## కార్మికుల హక్కులు సాధిస్తాం

### కొత్త గనుల కోసం కృషి చేస్తాం

- ప్రైవేటీకరణను అడ్డుకుంటాం
- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య
- శ్రీరాంపూర్ గనులపై గెలుపు సంబురాలు

శ్రీరాంపూర్, డిసెంబర్ 28 : కార్మికుల పక్షాన పోరాడుతుందనే నమ్మకంతోనే వారంతా ఏఐటీయూసీకి పట్టం కట్టారని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీ సీతారామయ్య పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావుతో కలిసి మాట్లాడారు. ఏఐటీయూసీని సింగరేణి గుర్తింపు సంఘంగా గెలిపించిన కార్మికులకు, ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన నాయకులు, యూనియన్ల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగేళ్ల కాల పరిమితితోనే ప్రధాన కార్మిక సంఘాల అంగీకారంతో గుర్తింపు సంఘం ఎన్నికలకు వెళ్లామని, ఇది నిజంగా కార్మికుల విజయమేనని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కార్మికుల హక్కుల సాధన కోసం, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కొత్త గనులు సాధిస్తామని, ప్రైవేటీకరణను అడ్డుకుంటామని పేర్కొన్నారు. గుర్తింపు హోదా సాధించినందుకు సంతోషంగా ఉందని, ఇక నుంచి యూనియన్లతో సంబంధం లేకుండా కార్మికుల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతామన్నారు.

**గనులపై సంబురాలు..**

ఏఐటీయూసీ గెలుపుపై శ్రీరాంపూర్‌లోని గనులు, ఓసీపీలు, డిపార్ట్‌మెంటులపై నాయకులు, కార్మికులు, కార్యకర్తలు గురువారం సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి.. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంరయ్య, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రావు, పిట్ కార్యదర్శులు ఆకుల లక్ష్మణ్, సారయ్య, నర్సింగారావు, నాయకులు ఫ్రోజ్‌ఖాన్, బాలకృష్ణ, గిజ్జ రమేశ్, సదానందం, భాస్కర్, సంపత్ పాల్గొన్నారు.


శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య